క్లుప్తంగా

3 నుంచి నవరాత్రి ఉత్సవాలు



రంగనాథస్వామి దేవాలయం

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథస్వామి దేవాలయంలో అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు దసరా నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, అర్చకులు కొమండూరి రంగస్వామి బుధవారం తెలిపారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథ స్వామి వారిని రోజుకో రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు. ఉదయం ప్రత్యేక పూజలు సాయంత్రం తూర్పుపేట గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. 12వ తేదీ మహాపూజతో పాటు శమీపూజ, దసరా ఉత్సవాలు చేపడతామని వివరించారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



వాలీబాల్, కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

చిప్పగిరి: స్థానిక ఫాతిమా ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల యాజమాన్యం బుధవారం తెలిపారు. 10వ తరగతి విద్యార్థులు లోకేష్,అరవింద్ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు, రాజేష్ కబడ్డీ, 9వ తరగతి విద్యార్థి సందీప్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు వివరించారు.

క్రీడలపై పట్టు సాధించాలి



కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న హెచ్‌ఎం సుజాత

ఆలూరు రూరల్: విద్యార్థి దశలో విద్య, క్రీడలపై పట్టు సాధించే విద్యార్థులకు భవిష్యత్‌లో మంచి అవకాశాలు లభిస్తాయని ఆలూరు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాఘవరావు, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుజాత అన్నారు. బుధవారం స్థానిక మోడల్ స్కూల్ ఆవరణలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. నియోజకవర్గ స్థాయిలో అండర్-14, అండర్-17 బాల,బాలికల విభాగంలో కబడ్డీ, ఖో-ఖో పోటీలు నిర్వహించారు. ఆరు మండలాల్లోని పాఠశాలల నుంచి దాదాపు 300 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. పీడీ కవిరాజు, పీడీలు, పీఈటీలు హాజరయ్యారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



హెచ్‌ఎం యల్లప్పను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఆస్పరి: మండలంలోని ములుగుందం బీసీ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు యల్లప్పకు జిలాస్థాయి అవార్డు లభించడంతో బుధవారం యల్లప్ప దంపతులను ఉపాధ్యాయులు సన్మానించారు. ఎంఈఓ తిరుమలరావు, ములుగుందం, కారుమంచి, బనవనూరు జిల్లా పరిషత్ హెచ్‌ఎంలు మహమ్మద్ మియా, శోభారాణి, శివరాం పుల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలు



ఆస్పరిలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

ఆస్పరి: మండల కేంద్రంలో బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ మూలింటి రాధమ్మ ఆధ్వర్యంలో గ్రామంలో దోమల నివారణ మందు పిచికారీ చేయించామని కార్యదర్శి జంప్లానాయక్ తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు.

భగవద్గీత గ్రంథాల పంపిణీ



అల్లుగుండులో విద్యార్థులకు భగవద్గీత గ్రంథాలు అందించిన స్వయంప్రభ

వెల్దుర్తి(కృష్ణగిరి): విద్యార్థి దశ నుంచి భగవద్గీత చదివి మంచి మార్గంలో నడవాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు గ్రహీత రిటైర్డ్ హిందీ పండిట్ స్వయంప్రభ పిలుపునిచ్చారు. మండలంలోని అల్లుగుండు గ్రామ పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం తిరుమల తిరుపతి దేవస్థానం ముద్రించిన భగవద్గీత గ్రంథాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. భగవద్గీతలో అనేక విజయాలకు సంబంధించిన మోటివేషన్స్ ఉన్నాయని అవి చదివితే జీవితాన్ని తీర్చిదిద్దుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. వంద మంది విద్యార్థులకు గ్రంథాలను ఉచితంగా అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విపత్తి

పంట వేసినప్పటి నుంచి తీవ్ర వర్షాభావం.. కొద్ది రోజుల నుంచి భారీ వర్షాలు. ఓ వైపు అనావృష్టి, ఆ వెంటనే అతివృష్టితో ఇబ్బందులు పడుతుంటే.. వెనువెంటనే తెగుళ్ల ఉధృతితో పత్తి రైతుకు కంటిమీద కునుకు కరువైంది. పైరు ఎదుగుదల లోపించి, తెగుళ్లతో కాయ రాలుతుండటంతో అరకొరగా పలిగిన పత్తి నల్లగా మారిపోతుండటంతో పలురకాల మందులు పిచికారీ చేసినా ఫలితం లేకపోయింది. దీంతో తెల్లబంగారం కాస్తా.. మా జీవితాలను తెల్లబోయేలా చేసిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ప్రారంభంలో వర్షాభావంతో పత్తి పైరులో లోపించిన ఎదుగుదల
- నెలన్నర నుంచి కురుస్తున్న వర్షాలకు విజృంభిస్తున్న తెగుళ్లు
- తెల్ల,ఎర్ర దోమ, రసం పీల్చే, ఆకుముడత తెగుళ్లతో ఎండుతున్న కాయలు
- వర్షాలతో నల్లబారుతున్న పత్తి
- పెట్టుబడులు కూడా కోల్పోయామంటున్న రైతన్నలు





రామదుర్గంలో దెబ్బతిన్న పత్తి కాయ, నల్లగా మారిన పత్తి



చిప్పగిరిలో ఎదుగుదల లోపించిన పత్తి పంట (ఇన్‌సెట్) ఎర్ర తెగులు సోకిన మొక్క

చిప్పగిరి: గతేడాది మంచి ధర లభించడంతో ఈ ఏడాది కూడా అదే ధర లభిస్తుందన్న ఆశతో అన్నదాతలు పత్తి పంటను ఖరీఫ్‌లో భాగంగా విస్తారంగా సాగు చేశారు. అరకొర వర్షాలకు పంట సాగు చేసిన వారికి.. ఆ తరువాత వరుణుడు ముఖం చాటేయడంతో పైరు ఎదుగుదల లోపించి గిడసబారింది. ఖరీఫ్‌లో భాగంగా మండలంలో 16,150 ఎకరాల్లో కంది, మిరప, సజ్జ, కొర్ర, వేరుశనగ, పత్తి తదితర పంటలను సాగు చేశారు. వీటిల్లో పత్తిని 1,100 ఎకరాలకు పైగా సాగు చేశారు. నాటినప్పటి నుంచి ఓ పక్క వర్షాభావం, ఆ తరువాత భారీ వర్షాలు, ప్రస్తుతం తెగుళ్లు వెంటాడుతుండటంతో పత్తి రైతుల పాలిట విపత్తుగా మారింది.

తీవ్ర వర్షాభావం..

గతేడాది క్వింటా పత్తి ధర రూ.10వేలకు పైగా పలికింది. దీంతో ఆశతో మండలంలోని నగరడోణ, బెల్డోణ, రామదుర్గం, ఏరూరు, నంచర్ల, దౌల్తాపురం, బంటనహాలు, ఏరూరు నేమకల్లు తదితర గ్రామాల్లో రైతులు ఖరీఫ్‌లో భాగంగా పత్తి పంట అధికంగా సాగు చేశారు. నాటు వేసిన తరువాత తీవ్ర వర్షాభావం తలెత్తింది. దాదాపుగా పూర్తిగి ఎండిపోయే దశకు చేరుకున్న సమయంలో నెలన్నర క్రితం వర్షాలు ప్రారంభమయ్యాయి. భారీ వర్షాలు కురవడంతో పొలాల్లో రోజల తరబడి వర్షపునీరు నిల్వ ఉండిపోయింది. నీటి తడి అధికమైన పైరు ఎర్రబారింది. కొన్ని రోజులు వర్షాలు తెరపినిచ్చినా.. తెగుళ్ల విజృంభించాయి. ఎర్ర తెగులు, తెల్ల దోమ, పచ్చ దోమ తీవ్ర మవడంతో పంట ఎండిపోవడం ప్రారంభమైంది. ఎన్ని మందులు కొట్టినా ఫలితం లేకపోవడంతో రైతన్నలకు ఏమి చేయాలో పాలుపోవడం లేదు. ఇక ఆకుముడత తెగులు తీవ్రమవడం, వివిధ రకాల పురుగులు రసం పీల్చడంతో కాయ దశలోనే రంధ్రాలు పండి పత్తి కాయలు ఎండిపోయి రాలిపోతున్నాయి. ఎక్కడో ఒక చోట మిగిలిన కాయలు పగిలినా.. వర్షాల కారణంగా పత్తి నల్లగా మారిపోతుండటంతో తెల్ల బంగారం కాస్తా.. తమ జీవితాలను తెల్లబోయేలా చేసిందని రైతులు వాపోతున్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పత్తి పంటలో తెల్ల దోమ, పచ్చ దోమ, గులాబీ రంగు పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు తక్షణమే చేపట్టాలి, తెల్లదోమ,పచ్చోమ నివారణకు క్లోనిక్‌మైడ్ మందును ఎకరాకు 60 గ్రాముల లీటరు నీటితో కలిపి పంటపై పిచికారీ చేయాలి. పొలంలో లింగాకర్షక బుట్టలు, జిగురు బుట్టలు ఏర్పాటు చేయాలి. జూన్ రెండవ వారంలోనే పత్తి సాగు చేస్తే గులాబీ పురుగు వ్యాపించే అవకాశం తక్కువగా ఉంటుంది. ప్రస్తుతం మండలంలో ప్రతి మంగళ, బుధ వారాల్లో అయా గ్రామాల్లో నిర్వహించే పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులు పాల్గొని సమస్యలను తమ దృష్టికి తెస్తే నివృతి చేస్తాం.

– విజయలక్ష్మి, మండల వ్యవసాయాధికారి

ఇప్పటికే రూ.50 వేల పెట్టుబడి అయ్యింది



నాకున్న నాలుగున్నర ఎకరాల్లో 3 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. పంట వేసి 2 నెలలు పైనే అయ్యింది. అధిక వర్షాలు, చీడపీడల ఉధృతి కారణంగా పంట ఎదుగుదల లోపించింది. అనేక సార్లు మందులు పిచికారీ చేసినా పంట ఎదగడం లేదు. మూడు ఎకరాల్లో పంట సాగుకు రూ.50వేల వరకు పెట్టుబడి పెట్టినా. పెట్టుబడి కూడా రాని పరిస్థితి కనిపిస్తుంది.

– సుంకన్న, పత్తి రైతు, చిప్పగిరి

దిగుబడిపై ఆశలు సన్నగిల్లాయి



పంటకు సోకుతున్న తెగుళ్లు, చీడపీడల కారణంగా కాసిన పత్తి కాయలన్నీ రాలిపోతున్నాయి. మరి కొన్ని కాయల నుంచి సరిగా పత్తి పగలడం లేదు. గులాబీ పురుగు, దోమ కారణంగా కాయలోని పత్తి పగలక ముందే నల్లగా మారుతుంది. ఎన్ని మందులు పిచికారీ చేసినా అదుపు కావడం లేదు. దిగుబడి లభిస్తుందనే ఆశలు లేవు. వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు, సలహాలు ఇచ్చి పత్తి రైతును కష్టాల నుంచి గట్టెక్కించాలి.

– పోతప్ప, రైతు, రామదుర్గం

విద్యార్థులకు క్రీడలు అవసరం



కబడ్డీ కూత పెడుతున్న డాక్టర్ కల్పన, చిత్రంలో ఆర్డీఓ రామలక్ష్మి

పత్తికొండ(తుగ్గలి) : విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని, క్రీడలతో కీర్తి ప్రతిష్టలు లభిస్తాయని ఆర్డీఓ ఎస్. రామలక్ష్మి అన్నారు. పట్టణంలోని జూనియర్ కాలేజీ మైదానంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న నియోజకవర్గ స్కూల్ గేమ్స్ బాలికల ఎంపిక పోటీలు బుధవారం ముగిశాయి. ముందుగా పోటీలను ప్రారంభించి..ఆర్డీఓ, వైద్యాధికారిణి కల్పన చెరో జట్టు తరఫున కొద్దిసేపు కబడ్డీ ఆడి క్రీడాకారిణులను ఉత్సాహపరిచారు. కబడ్డీ, ఖోఖో, చెస్, యోగా, షటిల్‌బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీల్లో 400 మంది క్రీడాకారిణిలు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు జిల్లా స్థాయిలో ఎంపిక పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ కోఆర్డినేటర్ చందూ నాయక్ తెలిపారు. అర్బన్ సీఐ జయన్న, హెచ్‌ఎం మాలతి, ఈఓ నరసింహులు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయండి

దేవనకొండ: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.శరత్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ కళాశాలలో బుధవారం విద్యార్థులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ గతంలో పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థుల కడుపులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిందన్నారు. జిల్లావ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వస్తున్నారన్నారు. కళాశాలలు సాయంత్రం వరకు ఉండటంతో మధ్యాహ్న భోజనం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా రాహుల్, కార్యదర్శిగా సురేంద్ర, కోశాధికారిగా లాల్‌చరణ్, ఉపాధ్యక్షులుగా బాలరాజు, భరత్, అశోక్, సహాయ కార్యదర్శులుగా శేఖర్, నాగార్జున, రాకేష్‌తో పాటు కార్యవర్గ సభ్యులుగా 12 మందిని ఎన్నుకున్నారు.

మహాత్ములకు అవమానం



నేమకల్లు సచివాలయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్ర పటాల కింద మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలు

చిప్పగిరి: సంప్రదాయాలు, పద్ధతుల గురించి ఉపన్యాసాలు ఇచ్చే కూటమి నాయకులు.. తమ నాయకుల ఫొటోల ఏర్పాటులో మహాత్ములను కించపరుస్తున్నారు. మండలంలోని నేమకల్లు గ్రామ సచివాయలంలో సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కల్యాణ్ ఫొటోలను మహాత్మా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాల కంటే పైనే ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తోంది. బుధవారం మండలంలోని నగరడోణ,నేమకల్లు గ్రామాల్లోని సచివాయాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పోస్టర్లను విడుదల చేశారు. అయినా కూటమి నాయకులు మహాత్ముల ఫొటోలను గమనించకపోవడం విశేషం.

దీన్‌దయాళ్ జయంతి

పత్తికొండ(తుగ్గలి) : సమాజంలో చిట్టచివరనున్న వ్యక్తికి సైతం స్వాతంత్ర్య ఫలాలు అందాలని పరితపించిన మహోన్నతుడు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అని బీజేపీ నాయకులు అన్నారు. దీన్ దయాళ్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి బుధవారం పత్తికొండలో బీజేపీ నాయకులు రామ్మోహన్, దండి మల్లికార్జున, చంద్రన్న, గోరంట్ల, శంకరయ్య ఆచారి, సీసీ రంగన్న పూలమాల వేసి నివాళులర్పించారు.

హొళగుంద: స్వతంత్ర్య యోదుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ 108వ జయంతిని బుధవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు జరుపుకున్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎం.ఎస్. ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నేషనల్ కౌన్సిల్ సభ్యుడు చిదానంద మాట్లాడుతూ దీన్ దయాళ్ సేవలను కొనియాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. రామలింగ, మహేష్,ఉలిగన్న, నాగేంద్ర, జాంటీ వీరేష్ పాల్గొన్నారు.

వేదావతి ప్రాజెక్టు పనులు చేపట్టండి

ఆలూరు: కూటమి ప్రభుత్వం వేదావతి నదిపై ప్రాజెక్టు నిర్మించేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించి పనులను ప్రారంభించాలని జిల్లా సీపీఐ కార్యదర్శి కె.గిడ్డయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పెద్దహోతూరు గ్రామంలో సీపీఐ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తుంగభద్ర జలాశయం నుంచి సక్రమంగా తాగు, సాగునీరు సరఫరా కావడంలేదన్నారు. దీంతో ఆయకట్టు రైతులు పంటలు సాగు చేయలేకపోతున్నారన్నారు. మండల కార్యదర్శి రామాంజనేయులు సిద్దలింగ, షెక్షావలి,సుభాను పాల్గొన్నారు. అంతకముందు పెద్దహోతూరు గ్రామ కార్యవర్గాన్ని 21 మందితో ఎంపిక చేశారు.

బర్దన్‌కు నివాళి

పత్తికొండ(తుగ్గలి) : సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఏబీ బర్దన్ జయంతిని బుధవారం పట్టణంలోని చదువుల రామయ్య భవన్‌లో నిర్వహించారు. సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి భీమలింగప్ప, మండల కార్యదర్శి రాజాసాహెబ్ బర్దన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బర్దన్ అలుపెరగని పోరాట నాయకుడని, ఎర్రజెండా భావాలతో దేశ ప్రజలకు నిస్వార్థ సేవలు అందించారని కొనియాడారు. సుల్తాన్, పెద్దీరన్న, నెట్టికంటయ్య, రంగన్న, బాషా, మాదన్న, సుంకన్న, శ్రీనివాసులు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామంలో పెద్ద మసీదు కాలనీలో బుధవారం సీసీ రోడ్డు పనులను సర్పంచ్ ఉలిగమ్మ ఆధ్వర్యంలో చేపట్టారు. ముందుగా జేసీబీతో చెత్తా చెదారం, ముళ్ల కంపలను తొలగించారు. రూ.10 లక్షలతో రోడ్డు పనులకు శ్రీకారం చుట్టామని సర్పంచ్ తెలిపారు. నాగరాజు, నాయకులు జనార్ధన, హనుమంతు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి



రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024లో భాగంగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ఒక పోలింగ్ కేంద్రంలో 1500 ఓటర్ల కంటే అధికంగా ఉన్న వారిని మరో పోలింగ్ కేంద్రాలకు మార్పుపై రాజకీయ పార్టీ ప్రతినిధుల నాయకులతో సమావేశం నిర్వహించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ గురించి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాముడు, ఎలక్షన్ డీటీ రామేశ్వర్‌గౌడ్, డీఎల్‌పీఓ కార్యాలయపు పరిపాలనాధికారి వీరభద్రప్ప, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

మద్దికెర : గ్రామంలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ బండారు సుహాసిని, ఈఓ శివకుమార్ సూచించారు. మండల కేంద్రంలోని కాలనీల్లో నీటి సరఫరాలో సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారని, దీంతో నీటి సమస్య ఉత్పన్నమవుతుందని కాలనీవాసులు బుధవారం ఫిర్యాదు చేశారు. నీటి పథకాల సిబ్బందితో వారు మాట్లాడుతూ బావులు, బోర్లలో నీరు సమృద్ధిగా ఉందని, అధికారుల ఆదేశాల మేరకు నీటిని సరఫరా చేయాలని సూచించారు. ప్రజల నుంచి ఫిర్యాదులందితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చోరీకి యత్నం

మద్దికెర : మండలంలోని ఎడవలి గ్రామంలో రోజూ మాదిరిగానే బుధవారం కూడా రంగన్న, శాంతమ్మ అనే దంపతులు ఇంటికి తాళంవేసి పొలం పనులకు వెళ్లారు. ఎవరూ లేని సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్ మీద వచ్చి తాళాలు తెరవడానికి ప్రయత్నిస్తుండగా గమనించిన గ్రామస్తులు కేకలు వేయగా పారిపోయారని స్థానికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని యాదరాళ్ల గ్రామానికి చెందిన సుంకన్న బుధవారం సాయంత్రం పని నిమిత్తం డోన్‌కు వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. టీడీఎస్ ఎక్స్‌ఎల్ స్కూటర్‌పై వెల్దుర్తిలో నుంచి రైల్వే గేట్ దాటి హైవే పైకి వెళ్తుండగా వెనుకనుంచి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సుంకన్న ఎడమ కాలుకు గాయం కావడంతో స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పైలెట్ ఉస్మాన్‌బాషా తెలిపారు.

పీఆర్ ఏఈగా జాకీర్ హుసేన్

కృష్ణగిరి: మండల పంచాయతీరాజ్ ఏఈగా జాకీర్ హుసేన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న అబ్దుల్ వహీద్ నంద్యాల జిల్లా నందికొట్కూరుకు బదిలీ కాగా ఆయన స్థానంలో పత్తికొండ పీఐయూ నుంచి ఈయన ఇక్కడి వచ్చారని ఎంపీడీఓ విశ్వమోహన్ తెలిపారు.

ఉండి ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి

ఆస్పరి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపి అవమానించిన ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణమరాజుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని మాల మహానాడు సంఘం జిల్లా అధ్యక్షుడు గుడిసె మహానంది ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆస్పరిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపడం బాధాకరమన్నారు. అలాగే కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావును ఎమ్మెల్యే నానాజీ అసభ్య పదజాలంతో దూషించారన్నారు. వీరిద్దరిపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. చంద్ర, నాగరాజు, లక్ష్మన, రంగస్వామి, బాలు, భరత్ పాల్గొన్నారు.

28న రక్తదాన శిబిరం

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల కేంద్రంలో ఈ నెల 28వ తేదీన స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీపీఐ, ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారుల కోసం స్వచ్ఛందంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. మండలస్థాయి అధికారుల సహకారంతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిబిరం ఉంటుందని ప్రజలు, యువత స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేయాలని కోరారు.

28న కుంకనూరు మార్కెట్‌కు వేలం

దేవనకొండ: మండలంలోని కుంకనూరు గ్రామంలో దినసరి కూరగాయల మార్కెట్ నిర్వహణకు ఈనెల 28వ తేదీన ఉదయం 11 గంటలకు గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి శివశంకర్‌సింగ్ బుధవారం తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డివిజనల్ పంచాయతీ అధికారి అప్‌సెట్ ప్రైజ్ నిర్ణయించి వేలం వేసేందుకు అనుమతినిచ్చినట్లు తెలిపారు. వేలం పాల్గొనే వారు పంచాయతీ నిబంధనలు పాటించాలని చెప్పారు.

హామీల అమలే లేదు.. మంచి ప్రభుత్వమెలా?



తహసీల్దార్ గోవింద్ సింగ్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

ఆలూరు: ఎన్నికల్లో కూటమి నేతలు ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు ఒక్కటీ అమలు చేయలేదు.. అలాంటప్పుడు ఇది మంచి ప్రభుత్వం అని ప్రచారం చేసుకోవడంలో ఆంతర్యమేమిటని ఏపీ రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయం నుంచి బుధవారం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. సంఘం మండల కార్యదర్శి ఈరన్న ,సీనియర్ నాయకులు కేపీ.నారాయణస్వామి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న పంట నష్టపరిహారాన్ని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ గోవింద్ సింగ్‌కు అందజేశారు. సీపీఐటీయూ నాయకులు కృష్ణ,పరమేష్,గౌడ్, శేఖన్న, రామాంజి, మైనా పాల్గొన్నారు.

ప్రజాదరణను ఓర్వలేక.. విష ప్రచారం

హొళగుంద: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జనాల్లో ఉన్న ప్రజాదరణను చూసి ఓర్వలేక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుపతి లడ్డూ విషయంపై విష ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా అన్నారు. బుధవారం పార్టీ నాయకులు ఎస్కే గిరి, హొళగుంద హైస్కూల్ పీఎంసీ మాజీ చైర్మన్ మజ్జిగ సిద్దయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ.. తాను చేసే మంచిపనితో ప్రజలు ఎల్లప్పుడు తనను గుర్తు పెట్టుకోవాలని తపన పడే జగనన్న కోట్లాది మంది కొలిచే వెంకన్నస్వామి విషయంలో అపచారం ఎలా చేస్తారని ప్రశ్నించారు. తమ రాజకీయం కోసం దేవుడికి అపచారం జరిగిందని ప్రచారం చేయడానికి దిగజారారన్నారు. కూటమి నాయకుల కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. భమూన కరుణాకర రెడ్డిలాగా చంద్రబాబు ప్రమాణం చేయగలరా అని ప్రశ్నించారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి



అమకతాడులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్

కృష్ణగిరి: రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించేందుకు కృషి చేయాలని, ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని పత్తికొండ ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని కంబాలపాడు, అమకతాడు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన పాల్గొని రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. వేరుశనగ, కంది తదితర పంటలను పరిశీలించారు. ఏఓ వెంకటేశ్వర్లు, పశువైద్యాధికారి రమేష్, సర్పంచ్ బోయ సర్వేశ్వరి, పంచాయతీ కార్యదర్శి అనూష పాల్గొన్నారు.


హాలహర్వి: మండలంలోని బాపురం, హాలహర్వి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఏఓ శివశంకర్ తెలిపారు. హాలహర్విలో సర్పంచ్ మల్లికార్జున, ఎంపీటీసీ రామకృష్ణ, బాపురం గ్రామంలో సర్పంచ్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఆలూరు ఏడీఏ సునీత, డీఆర్‌సీ సెంటర్ నుంచి ఏడీఏ వేదమణి పాల్గొని రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. జొన్న పంటకు కత్తెర పురుగు ఆశించిందని, పోలో లేదా పెగాసస్ 80 గ్రాములు 100 లీటర్ల నీటిలో లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ ప్లస్ నోవాల్యూరన్ 1.5 మి.లీ. లీటర్ నీటికి కలిపి సుడులలో వేయాలన్నారు.



హాలహర్విలో వరి రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ, అధికారులు

హొళగుంద: పంటల సాగులో మెళుకువలు పాటించి అధిక దిగుబడులు పొందాలని ఏఓ ఆనంద్ లోకదశ్ తెలిపారు. బుధవారం హెబ్బటం, లింగంపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. పంటలకు పురుగులు ఆశించడం వల్ల దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని సేంద్రియ మందులను వాడితే సమస్య తగ్గిపోతుందన్నారు. ఏఈఓ విరుపాక్షి, రైతులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతిచెందిన శ్రీనివాసులు

ఆలూరు రూరల్: తాగునీటి మోటారుకు విద్యుత్ ప్లగ్ తగిలించే క్రమంలో విద్యుదాఘాతానికి గురై ముద్దనగేరి గ్రామానికి చెందిన శ్రీనివాసులు (28) మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. శ్రీనివాసులు ఆలూరులోని ఓ పెట్రోల్ బంకులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం కుళాయి నీళ్ల పట్టుకునేందుకని మోటారుకు ఉన్న ప్లగ్‌కు విద్యుత్ సరఫరా అయ్యే మరో వైరుకు ఉన్న ప్లగ్‌ను జోడిస్తుండగా షాక్‌కు గురై కుప్పకూలిపోయాడు. గ్రామస్తులు అతడిని అంబులెన్స్‌లో ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు వెల్లడించారు.

బైకుపై నుంచి పడి మహిళ మృతి

పెద్దకడబూరు : మండల పరిధిలోని కల్లుకుంట గ్రామానికి చెందిన ఖాదర్ బీ, భర్త సద్దాం హుసేన్, పిల్లలతో కర్ణాటక రాష్ట్రం సిరుగుప్ప నుంచి ద్విచక్ర వాహనంపై వస్తూ నౌలేకల్లు గ్రామ సమీపంలోని తాటివనం వద్ద కుక్క అడ్డు రావడంతో బైకు అదుపు తప్పగా ఖాదర్ బీ కిందపడిపోయింది. చికిత్స నిమిత్తం కర్నూలుకు తీసుకెళ్లగా.. చికిత్స పొందతూ మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

యువతి అదృశ్యం

మండల పరిధిలోని కల్లుకుంట గ్రామానికి చెందిన చాకలి నాగమ్మ(19) బుధవారం ఉదయం 5గంటల సమయంలో బహిర్భూమికని వెళ్లి రాత్రి అయినా తిరిగి రాలేదు. దీంతో తల్లి చాకలి పద్మావతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గాయపరచిన వ్యక్తిపై కేసు నమోదు

మండల పరిధిలోని నాగులాపురం గ్రామానికి చెందిన బోయ తలారి ఈరన్న అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన నరేంద్ర, వీరేష్ అనే వ్యక్తులు కాలువ పూడిక విషయంలో పడి పారతో కొట్టారు. దీంతో అతనికి గాయాలయ్యాయి. ఈరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.